సాక్షి
కాకినాడ
ఆదివారం । 8 । జనవరి । 2023



నిత్యాన్నదానానికి విరాళం


మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ నిత్యాన్నదాన ట్రస్టుకు హైదరాబాద్‌కు చెందిన సంకు సత్య వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు రూ.50,001 విరాళంగా అందించారు.



రత్నగిరికి సంక్రాంతులు

రత్నగిరికి అధునాతన వెలుగులు ప్రసరించనున్నాయి. స్వామివారి ఆలయంలో ఆధునిక విద్యుత్ పరికరాలు, అండర్ గ్రౌండ్ కేబుల్స్‌తో విద్యుత్తు సరఫరా జరగనుంది. - IIలో▸

డెల్టాలకు నీరు



రాజమహేంద్రవరం రూరల్: కాటన్ బ్యారేజ్ నుంచి శనివారం డెల్టా కాలువలకు 9,170 క్యూసెక్కులు విడుదల చేశారు. తూర్పుడెల్టాకు 2,650, మధ్యడెల్టాకు 1,920, పశ్చిమడెల్టాకు 4,600 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

ఓం నమో వేంకటేశాయ



టన్ను పులిహోర, బూరెలు, పూలతో రూపొందించిన వేంకటేశ్వరస్వామి ప్రతిమ

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం టన్ను పులిహోర, బూరెలతో స్వామివారి ప్రతిమను రూపొందించి భక్తులకు దర్శనం కల్పించారు. తిరుప్పావడ సేవలో భాగంగా పులిహోరతో స్వామివారి ప్రతిమను రూపొందించి బూరెలు, పూలతో విశేషంగా అలంకరించారు. ప్రతి సంవత్సరం తిరుప్పావడ సేవలో భాగంగా పులిహోర, బూరెలు, పూలతో స్వామివారి ప్రతిమను ఏర్పాటు చేస్తున్నట్లు దేవస్థానం చైర్మన్ కోలా భీమేశ్వరరావు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సత్యదేవుని దర్శించిన 30 వేల మంది



సత్యదేవుని ఆలయ ప్రాంగణంలో భజనలు చేస్తున్న భక్తులు

అన్నవరం: రత్నగిరివాసుడు సత్యదేవుడిని దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఉత్తరాది రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనానికి తరలి వచ్చారు. వీరంతా స్వామివారి వ్రతాలాచరించారు. ఆలయ ప్రాంగణంలో భజనలు చేశారు. సత్యదేవుడిని దర్శించిన అనంతరం సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించారు. స్వామివారిని సుమారు 30 వేల మంది దర్శించారు. స్వామివారి వ్రతాలు రెండు వేలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం సమకూరింది. సుమారు ఐదు వేల మంది భక్తులకు సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో ఉచిత భోజన సౌకర్యం కల్పించారు.

రేపటి నుంచి సౌత్‌జోన్ ఖోఖో టోర్నమెంట్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూకే క్రీడా ప్రాంగణంలో సోమవారం నుంచి ఇండియన్ యూనివర్సిటీ అసోసియేషన్ సహకారంతో సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఖో–ఖో టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు శనివారం తెలిపారు. టోర్నమెంట్‌కు ఏపీ, తెలంగాణతో పాటు కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల్లో 78 యూనివర్సిటీల నుంచి 1200 మంది క్రీడాకారులు, 300 మంది అధికారులు, కోచ్‌లు హాజరవుతారని చెప్పారు. ఈ నెల 12 వరకూ పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రారంభం రోజున కాకినాడ ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి, కురసాల కన్నబాబు, కలెక్టర్ కృతికాశుక్లా, ఎస్పీ రవీంద్రనాథ్‌బాబుతో పాటు పలువురు స్పోర్ట్స్ బోర్డు అధికారులు హాజరవుతారన్నారు. టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా స్పోర్ట్స్ కౌన్సెల్ కార్యదర్శి డాక్టర్ శ్యామ్‌కుమార్ వ్యవహరిస్తారని వివరించారు.

రూ. 7.41 లక్షల విలువైన సరకు జప్తు

కాకినాడ సిటీ: పీడీఎస్ బియ్యం నిల్వ, రవాణా చేస్తున్న 10 మందిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి రూ.7.41 లక్షల విలువైన సరకును ప్రభుత్వానికి జప్తు చేస్తూ జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ ఆదేశాలు జారీ చేశారు. అక్రమ రవాణాకు ఉపయోగించిన వాహన యజమానికి రూ. 23 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. కార్డుదారుల నుంచి కొనుగోలు చేసి అక్రమ రవాణాకు పాల్పడిన వారిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు.

SUNDAY SPECIAL

రామ్ పాటంటే.. లక్ష్మీపటాసే..

- గొంతు విప్పితే డీజే తలొంచాల్సిందే
- యువతను ఉర్రూతలూగిస్తున్న గాత్రం
- గాయకుడు, రచయిత, సంగీత దర్శకుడిగా రాణిస్తున్న కోలంక యువకుడు రామ్ మిరియాల

పిఠాపురం: ఆయన పాడితే అది పక్కా లక్ష్మీపటాస్ బాంబ్‌లా పేలుతుంది. గళం విప్పితే డీజేను మించి రీసౌండ్ వస్తుంది. పల్లె నుంచి పట్నం వరకూ అందరూ మెచ్చే పాట అతనిది. చౌరస్తాలో గట్టిగా కేక వేస్తే జనం గుమిగూడాల్సిందే. ఒక్కసారి ఆయన పాట వింటే ఫిదా అవ్వాల్సిందే. ఆయనే వర్ధమాన సింగర్ రామ్ మిరియాల. చిట్టి నీ నవ్వంటే.. అని గొంతు విప్పితే అందరూ కోరస్ పాడారు. మాయా.. అంటూ పాడితే పాటల అభిమానులు ఆయన మాయలో పడిపోయారు. డీజే టిల్లు... అని రాగం అందుకుంటే తీన్‌మార్ స్టెప్‌లు వేశారు. బీమ్లా నాయక్ వంటి టైటిల్ సాంగ్‌తో కుర్రకారును ఒక ఊపు ఊపేశాడు. తెలుగు పాటకు వెస్ట్రన్ జోడించే తీరును చూసి మంత్ర ముగ్ధులయ్యారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం కోలంకలో రైతు కుటుంబంలో పుట్టిన రామ్ ఇంటర్ వరకు పిఠాపురంలో చదివారు. బీకాం హైదరాబాద్‌లో చదివారు. సొంత ఊరిలో వేరే పేర్లతో పిలిచినా సినిమా రంగానికి రామ్ మిరియాలగానే పరిచయమయ్యారు. చదువు పూర్తయ్యాక ఒక కార్పొరేట్ కంపెనీలో ట్యాక్స్ కన్సల్టెంట్‌గా చేరారు. పాటే ప్రాణమైన రామ్ తర్వాత తన అభిరుచికి తగ్గట్టుగా రేడియో మిర్చిలో ప్రోమో ప్రొడ్యూసర్‌గా చేరారు. స్నేహితులతో కలిసి చౌరస్తా బ్యాండ్‌ను ప్రారంభించారు. ఇది యువతను ఉర్రూతలూగించింది. యూట్యూబ్‌లో కోట్ల వ్యూస్‌ను సంపాదించి పెట్టింది. అందరితో స్టెప్పులేయించింది. అనతి కాలంలోనే రామ్ మంచి సింగర్‌గా రాణించారు. ప్రస్తుతం పెద్ద పెద్ద బ్యానర్ సినిమాల్లో పాటలు పాడే అవకాశాలను అందిపుచ్చుకున్నారు. ఫ్లూట్ వాయించడంలో ఈయనకు మంచి ప్రావీణ్యముంది.

రెండు యాసల్లో సునాయాసంగా..

ఎవరైనా తమది కాని యాసలో మాట్లాడాలన్నా.. పాట పాడాలన్నా కష్ట పడాలి. రామ్ మాత్రం ఆంధ్ర, తెలంగాణ మాండలికాల్లో సునాయాసంగా పాటలు పాడుతున్నారు. హైదరాబాద్ వెళ్లి సుమారు 20 ఏళ్లు ఉండడంతో పాటు అక్కడి అమ్మాయినే పెళ్లి చేసుకున్నారు. ఎక్కువ కాలం ఉండటంతో రెండు యాసల్లోనూ పాటలు పాడడం కొంత సులభమైందంటారు రామ్. చిట్టి నీనవ్వంటే, సాంబశివా నీదు మహిమ, సిలకా ఎగిపోయావా అంటూ ఈ మూడు పాటలు పాడింది ఆయనే. కానీ మూడు పాటల్లో మూడు వేర్వేరు గొంతులు వినిపించినట్టుంటాయి. పాటకు తగ్గట్టుగా గొంతును ట్యూన్ చేయడంలో ఆయనకు ఆయనే సాటి.

ఆయన ప్రతీ పాట ఆణిముత్యామే..

'చేతులెత్తి మొక్కుతా చేయి చేయి కలపకురా.. కాళ్లు కూడా మొక్కుతా అడుగు బయట పెట్టకురా' అంటూ రామ్ కరోనా సమయంలో పాడిన పాట జనం గుండెలను హత్తుకుంది. హైదరాబాద్ నుంచి ఖమ్మం, మారేడుమిల్లి మీదుగా కోలంక వస్తూ మార్గంలో ఎదురయ్యే పరిస్థితులను 'ఊరెల్లి పాతా మామా.. ఊరెల్లి పోతా.. ఎర్ర బస్సెక్కి మళ్లీ తిరిగెల్లిపోతా' అంటూ పాటగా మలిచారు. 'చూపుకేమో శ్రీదేవి.. వగలుపోయే వయ్యారి.. భాషలన్నీ ఇడిసేసి.. నన్ను ఒగ్గేసిపోనాది' అంటూ ఓ ప్రేమికుడి వ్యధను గొంతులో పలికించి కేరీర్‌లో తొలి పాటకు శ్రీకారం చుట్టారు. గోరటి వెంకన్న, వందేమాతరం శ్రీనివాస్ వంటి వారు రాసిన పాటలు పాడి మైమరిపింపజేశారు. పేరొందిన సింగర్లతో కలిసి పాడే అవకాశాలను దక్కించుకుంటున్నారు.



రామ్ మిరియాల



సంగీతమంటే చాలా ఇష్టం

చిన్నప్పటి నుంచి సంగీతంపై మమకారం. ఈ ఉత్సాహంతోనే ప్రైవేటు సాంగ్స్ పాడాను. చిరంజీవి, బాలకృష్ణ, పవన్ కల్యాణ్ వంటి హీరోల సినిమాలకు పాటలు పాడాను. డీజే టిల్లు–2 సినిమాకు సంగీత దర్శకుడిగా పనిచేస్తున్నాను. సినిమా పాటల అవకాశాలు పెరుగుతున్నాయి. ఎవరు ఏ రంగంలో ఏది సాధించాలన్నా ముందు పట్టుదల ఉండాల్సిందే. అందరి సహకారంతో ఇప్పుడిప్పుడే సినిమా రంగంలో నిలదొక్కుకుంటున్నా . 'ఊరెల్లి పాతా మామ..పాట నాకు చాలా ఇష్టం. మనసు పెట్టి రాశాను. చాలా మంచి గుర్తింపు తెచ్చింది.

\- రామ్ మిరియాల, సంగీత దర్శకుడు, సింగర్

గూటం స్వామికి మద్దూరి పురస్కారం



రాజమహేంద్రవరం రూరల్: కవి, రచయిత, కథకుడు, డాక్టర్ గూటం స్వామికి మద్దూరి నగేష్‌బాబు స్మారక స్ఫూర్తి పురస్కారం ప్రకటించారు. నగేష్ బాబు స్మారక పురస్కార కమిటీ కన్వీనర్ తంగిరాల సోని నుంచి తనకు ఈ మేరకు సమాచారం అందినట్లు స్వామి ఓ ప్రకటనలో తెలిపారు. తిప్పుడు పొట్లం కవితా సంపుటికి ఈ పురస్కారం లభించిందన్నారు. విజయవాడలోని ఠాగూర్ గ్రంథాలయంలో ఈ నెల 10న జరిగే కార్యక్రమంలో పురస్కారం అందుకోనున్నట్లు వివరించారు. డా.గూటంస్వామి బొమ్మూరులోని జీపీఆర్ హైస్కూల్‌లో తెలుగు భాషోపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. కవిగా, కథకుడిగా ,విమర్శకుడిగా, నవలా రచయితగా సాహిత్యలోకంలో స్వామి ప్రసిద్ధులు.

డాక్టర్ దశరథ రామారెడ్డికి పూర్వ విద్యార్థి గౌరవ పురస్కారం



దశరథ రామారెడ్డికి పురస్కారాన్ని అందజేసి సత్కరిస్తున్న ఎంఆర్ జయరాం

అనపర్తి: హైదరాబాద్ యశోద ఆసుపత్రికి చెందిన ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ తేతలి దశరథ రామారెడ్డి ఉత్తమ పూర్వ విద్యార్థి గౌరవ పురస్కారాన్ని అందుకున్నారు. బెంగుళూరులోని ఎంఎస్ రామయ్య మెడికల్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమాన్ని శనివారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల పూర్వ విద్యార్థి అయిన డాక్టర్ దశరథ రామారెడ్డికి కళాశాల అధ్యక్షులు, కులపతి ఎంఆర్ జయరాం ఉత్తమ పూర్వ విద్యార్థి గౌరవ పురస్కారాన్ని అందజేసి దుశ్శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు.

జిల్లా మహిళా సమాఖ్య అగ్రస్థానం

- ఫ్యాషన్ డిజైన్ సెంటర్‌ను ప్రారంభించిన కలెక్టర్ కృతికాశుక్లా

సామర్లకోట: ఫ్యాషన్ డిజైన్ సెంటర్‌తో జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు పురోగమించాలని కలెక్టర్ కృతికా శుక్లా ఆకాంక్షించారు. స్థానిక టీటీడీసీలో ఏర్పాటు చేసిన ఫ్యాషన్ డిజైన్ సెంటర్‌ను శనివారం ఆమె ప్రారంభించారు. ఫ్యాషన్ డిజైన్ సెంటర్‌లో పని చేస్తున్న వారితో కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రగతి భవన్‌లో జరిగిన జిల్లా మహిళా సమాఖ్య సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహిళా యూనిట్లు ప్రథమ స్థానంలో ఉన్నాయని కృతికా శుక్లా చెప్పారు. జిల్లాలోని మహిళా సంఘాల యూనిట్లపై ఇతర రాష్ట్రాలు దృష్టి సారిస్తున్నాయన్నారు. జిల్లాలో మొట్టమొదటి సారిగా 120 అధునాతన కుట్టుమెషీన్లతో ఫ్యాషన్ డిజైన్ సెంటర్‌ను ప్రారంభించారన్నారు. ఈ సెంటర్‌కు కావలసిన ఆర్డర్లను తీసుకువచ్చే బాధ్యతను జిల్లా అధికారులు తీసుకుంటారన్నారు. నాణ్యతగల ఉత్పత్తులుంటే మార్కెట్ విస్తృతమవుతుందన్నారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యు.కొత్తపల్లి, తొండంగి సమాఖ్యలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ కె. శ్రీరమణి అధ్యక్షత వహించారు. జిల్లాలో 4 లక్షల మంది మహిళా సంఘా సభ్యులు ఉన్నారని తెలిపారు. 20 మండల సమాఖ్యలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో జిల్లా మహిళా సమాఖ్య ప్రథమ స్థానంలో ఉందన్నారు. సూర్యారావు డిగ్రీ కళాశాలల అధినేత ఎండీ చాంద్‌బాషా, వికాస పీడీ లచ్చారావు ఇప్పటికే డిజైనింగ్ సెంటర్‌కు ఆర్డర్లు ఇచ్చారని తెలిపారు. జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షరాలు జి. సంధ్యారాణి, కార్యదర్శి జి.గంగాతల్లి, కోశాధికారి ఎ.సుమిత్ర, డీపీఎంలు బాబూరావు, వెంకటేశ్వరరావు, భరత్, కేశవ్, రాయ్, స్త్రీ నిధి ఏజీఎం ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.



సామర్లకోట ఫ్యాషన్ డిజైన్ సెంటర్‌లో దుస్తులు కుట్టే మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

కలెక్టరేట్‌లో గ్రూప్-1 కంట్రోల్ రూం

కాకినాడ సిటీ: జిల్లాలో ఆదివారం ఏపీపీఎస్సీ గ్రూప్–1 ప్రిలిమ్స్ జరగనున్న నేపథ్యంలో కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ కృతికా శుక్లా శనివారం తెలిపారు. అభ్యర్థులకు సందేహాలు ఉంటే కంట్రోల్ రూం 98499 03816, 81848 38068 నంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. పరీక్ష సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య విద్యా సంస్థల ప్రాంగణంలో ఏడు కేంద్రాల్లో పరీక్ష జరుగుతుందన్నారు. 4,782 మంది అభ్యర్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాసేందుకు ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ వివరించారు.

సంక్రాంతి క్రీడా సంబరాల ముగింపు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మంత్రి రాజా, ఎస్పీ రవీంద్రనాథ్ బాబు



సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఏర్పాటు చేసిన పూరి గుడెసె

హాజరైన ఆర్‌అండ్‌బీ మంత్రి దాడిశెట్టి రాజా

తుని: సంక్రాంతి పండగను ప్రతిఒక్కరూ సుఖసంతోషాలతో జరుపుకోవాలని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆకాంక్షిచారు. తుని పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన సాంప్రదాయ సంక్రాంతి క్రీడా సంబరాల ముగింపు వేడుకలు శనివారం సాయంత్రం తుని రాజా కళాశాల మైదానంలో ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా మంత్రి దాడిశెట్టి రాజా, జిల్లా ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు హాజరయ్యారు. సంక్రాంతి ప్రాధాన్యత ఉట్టిపడేలా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రి సందర్శించారు. క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన భోగి మంటను వెలిగించి పండుగకు శ్రీకారం చుట్టారు. వాలీబాల్, కబడ్డీ, టెన్నిస్, రంగవల్లికలు, లెమెన్ స్పూన్, టగ్ ఆఫ్ వార్ తదితర పోటీల్లో విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి రాజా మాట్లాడుతూ ప్రజలు సంతోషంగా పెద్ద పండగను జరుపుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ప్రతి సంవత్సరం సంప్రదాయబద్ధంగా సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. పండుగ వేళ ప్రతిఒక్కరూ ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు మాట్లాడుతూ భావితరాలకు సంక్రాంతి ప్రాధాన్యతను వివరించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. పండగ సమయంలో యువత అసాంఘిక కార్యకలాపాల జోలికి పోకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. కోలాటం, నృత్య ప్రదర్శనలు అందరినీ అలరించాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి, మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపాటి అమ్మాజీ, తుని మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ క్వాజా, గాంధీ సత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్ర రెడ్డి, జెడ్ఆర్‌యూసీసీ సభ్యుడు బోడపాటి శ్రీను, వైఎస్సార్ సీపీ తుని పట్టణ, రూరల్ మండలాధ్యక్షులు రేలంగి రమణాగౌడ్, పోతల రమణ, తుని పట్టణ సీఐ నాగ దుర్గారావు, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు పాల్గొన్నారు.

స్నేహితురాలి వైద్యానికి రూ.3.92 లక్షల సాయం

పిఠాపురం: సహచర విద్యార్థిని ప్రమాదానికి గురై ప్రాణాపాయ స్థితిలో ఉండడాన్ని తోటి విద్యార్థులు జీర్ణించుకోలేక పోయారు. ఎలాగైనా ఆమెను కాపాడాలని నడుం బిగించారు. పిఠాపురం నవ చైతన్య కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న దండెం రమ్యశ్రీ ఇటీవల ప్రమాదానికి గురై కాకినాడలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. మెరుగైన వైద్యం చేస్తే తప్ప ఆమె బతికే అవకాశాలు లేవని వైద్యులు చెప్పారు. ఆమెది నిరుపేద కుటుంబం కావడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, కళాశాల యాజమాన్యం కలిసి ఏకంగా రూ.3,92,229 పోగు చేసి కళాశాల ప్రిన్సిపాల్ తోట శ్రీనివాస్, చైర్మన్ కె.సత్య శ్రీనివాస్ ద్వారా బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేసి స్నేహధర్మాన్ని చాటుకున్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

క్లుప్తంగా

కుప్పం వెళ్లొద్దు బాబూ..

మంత్రి దాడిశెట్టి రాజా



మాట్లాడుతున్న మంత్రి దాడిశెట్టి రాజా

తుని: సంక్రాంతి పండగ ప్రశాంతంగా జరుపుకోవాలంటే చంద్రబాబు కుప్పం నియోజకవర్గానికి రాకూడదని ప్రజలు కోరుకుంటున్నారని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. శనివారం తుని పట్టణంలో జరిగిన సంక్రాంతి సంబరాలకు హాజరైన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అక్కడి ప్రజలు పంటలు పండి సంతోషంగా ఉన్నారని, ప్రచారం కోసం చంద్రబాబు పర్యటనకు వస్తున్నారంటే భయపడుతున్నారన్నారు. కందుకూరు, గుంటూరు జిల్లాల్లో జరిగిన చంద్రబాబు రోడ్ షో 11 మంది అమాయకుల ప్రాణాలను బలిగొందన్నారు. కుప్పం పర్యటనకు వస్తే ప్రశాంతత ఉండదని ప్రజలు భయపడుతున్నారన్నారు. ప్రజల క్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని చంద్రబాబు వ్యవహరించాలని హితవుపలికారు. ప్రజల మధ్య చిచ్చు పెట్టవద్దని సూచించారు. రాష్ట్రంలో ప్రజలంతా ఆనందంగా పండగ జరుపుకొనేందుకు సమాయత్తం అవుతున్నారని, టీడీపీ నాయకులు, ఎల్లో మీడియా విద్వేషాలను సృష్టించి పైశాచిక ఆనందం పొందుతున్నారని విమర్శించారు.

రత్నగిరికి సంక్రాంతులు



స్వర్ణకాంతితో ప్రకాశిస్తున్న తూర్పు రాజగోపురం



రత్నగిరి విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కొత్త జనరేటర్లు

- నిరాటంకంగా విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు
- రూ.1.60 కోట్లతో అభివృద్ధి పనులు

అన్నవరం: రత్నగిరికి కొత్త కాంతులొస్తున్నాయి.. అధునాతన వెలుగులు ప్రసరించనున్నాయి.. అన్నవరం వీరవెంకట సత్యనారాయణ స్వామివారి ఆలయంలో ఆధునిక విద్యుత్ పరికరాలు, అండర్ గ్రౌండ్ కేబుల్స్‌తో నిరాటంకంగా విద్యుత్తు సరఫరా జరుగనుంది. దీనికోసం రూ.1.60 కోట్లతో రెండు జనరేటర్లు అదనంగా ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్ నిలిచిపోతే కేవలం 40 సెకన్లలో జనరేటర్ల ద్వారా విద్యుత్ సరఫరా అయ్యేలా పవర్ హౌస్‌లను ఆధునీకరిస్తున్నట్లు దేవస్థానం ఎలక్ట్రికల్ డీఈ టి.సూర్యనారాయణ శనివారం 'సాక్షి'కి తెలిపారు. రత్నగిరిపై స్వామివారి ఆలయం, వ్రత మండపాలు, కల్యాణ మండపం, ఇతర కార్యాలయాలకు విద్యుత్ సరఫరాకు అండర్ గ్రౌండ్ కేబుళ్లు వేస్తున్నామని వివరించారు.

రత్నగిరి, సత్యగిరి పవర్ హౌస్‌లలో..

రత్నగిరి, సత్యగిరి, కొండ దిగువన దేవస్థానానికి మూడు పవర్ హౌస్‌లు ఉన్నాయి. ఇందులో రత్నగిరిపై సీఆర్వో ఆఫీస్ పక్కన పవర్‌హౌస్‌లో 250 కేవీ, 500 కేవీ విద్యుత్తు జనరేటర్లు ఉన్నాయి. వీటికి తోడు 380 కేవీ విద్యుత్ జనరేటర్ ఏర్పాటు చేశారు. సత్యగిరి పవర్‌హౌస్‌లో ప్రస్తుతం 320 కేవీ జనరేటర్లు రెండు ఉండగా, అదనంగా 380 కేవీ జనరేటర్ అందుబాటులోకి రానుంది. రత్నగిరి పవర్‌హౌస్‌లో కొత్త జనరేటర్ల ఏర్పాటు శనివారంతో పూర్తయిందని డీఈ తెలిపారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ సత్యనారాయణ మూర్తి ఆదేశాల మేరకు దేవస్థానానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. విద్యుత్ సరఫరా నిలిచిపోతే మొదట 250 కేవీ జనరేటర్ ఆన్ అవుతుంది. దాని కెపాసిటీ చాలకపోతే 380 కేవీ, ఆ కెపాసిటీ కూడా చాలకపోతే 500 కేవీ జనరేటర్స్ ఆన్ అవుతాయి.

త్వరలో సబ్‌స్టేషన్ నిర్మాణం

స్వామివారి దేవస్థానానికి మరింత నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడానికి రత్నగిరిపై రూ.ఐదు కోట్లతో ఇన్‌డోర్ 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను నిర్మించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి సీఆర్వో ఆఫీస్ పక్కన 1,048 గజాల స్థలాన్ని దేవస్థానం సమకూర్చుతోంది. రాష్ట్ర ప్రభుత్వ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) దీనిని నిర్మిస్తోంది.

సంక్రాంతి నాటికి వెలుగులు



ఈ సంక్రాంతికి రత్నగిరిపై కొత్త వెలుగులు ప్రకాశించాలనే ఉద్దేశంతో పనిచేస్తున్నాం. విద్యుత్ జనరేటర్లు అమర్చే పని పూర్తయ్యింది. అండర్ గ్రౌండ్ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసే పనులు చురుగ్గా జరుగుతున్నాయి. న్యూసీసీ సత్రంపై శంఖు, చక్రం, నామం ఏర్పాటు చేసే పనులు చేపట్టాం. రెండు రాజగోపురాలు బంగారు రంగు దీపాల వెలుగులో ప్రకాశించేలా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశాం. తూర్పు రాజగోపురం మెట్లకు కూడా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తున్నాం.

– సూర్యనారాయణ, దేవస్థానం ఎలక్ట్రికల్ డీఈ

లక్కీ షాపింగ్ మాల్ ప్రారంభం



షాపింగ్ మాల్‌లో పట్టు చీరలను పరిశీలిస్తున్న సినీ తారలు అనసూయ, నేహాశెట్టి

పెద్దాపురంలో సినీతారల సందడి



జ్యోతిప్రజ్వలన చేసి మాల్‌ను ప్రారంభిస్తున్న దొరబాబు, మట్టే శ్రీనివాస్

పెద్దాపురం: స్థానిక దర్గా సెంటర్‌లో లక్కీ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో శనివారం సినీ తారలు సందడి చేశారు. అనసూయ (జబర్దస్త్ ఫేమ్), నేహాశెట్టి (డీజేటిల్లు ఫేమ్)ల చేతుల మీదుగా ఈ మాల్ ప్రారంభించారు. తొలుత షాపింగ్ మాల్ అధినేతలు శ్రీను, రత్తయ్య, స్వామి ఆధ్వర్యంలో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, ప్రముఖ పారిశ్రామిక వేత్తలు మట్టే సత్యప్రసాద్, మట్టే శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు, ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, ఆగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ తదితరులు మాల్‌ను సందర్శించి మాట్లాడారు. లక్కీ షాపింగ్ మాల్ బ్రాంచ్ పెద్దాపురంలో ఏర్పాటు చేయడం పట్టణాభివృద్ధికి శుభసూచికమన్నారు. తక్కువ ధరకే నాణ్యమైన వస్త్రాలను అందించడం మంచి పరిణామమన్నారు. అనంతరం సినీతారలు అనసూయ, నేహాశెట్టి మాల్ వద్దకు వచ్చేసరికి అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ వస్త్ర ప్రపంచంలో లక్కీ షాపింగ్ మాల్‌కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. అటువంటి నాణ్యత, అద్భుతమైన షాపింగ్ అనుభూతినందించే సువిశాలమైన షోరూమ్ ఇక్కడ ఏర్పాటు చేయడం అభినందనీయమని అనసూయ, నేహాశెట్టి అన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి మాల్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో బిల్డింగ్ యజమాని గోమాడ సూరిబాబు, కంకటాల ఎండీ కంకటాల మల్లిక్, వార్డు కౌన్సిలర్ విడదాసరి రాజా, వైఎస్సార్ సీపీ నాయకులు గోపు మురళి, కనపర్తి చీమదొర, టీడీపీ నాయకులు బొడ్డు బంగారుబాబు, తూతిక రాజు, నాళం సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

YELESWARAM NAGAR PANCHAYAT

e-Procurement Notice

Online tenders are invited for Roc No.16/2019-E1, Dt : 08-01-2023 (14th FC Works-2) Estimate Amount of Rs. 48.50 Lakhs. Laste date of receipt of tenders on before Dt: 17-01-2023 upto 5:30 PM. Further details can be seen at www.tender.apeprocurement.gov.in

Contact Number : 9652065430, 9652065431

COMMISSIONER, Yeleswaram Nagar Panchayat

ఆరేళ్లుగా నక్కి.. ఆఖరికి చిక్కి

హత్య కేసులో నిందితుడి అరెస్ట్



అరెస్టు చేసిన నిందితుడిని హాజరుపరిచిన ఇన్‌స్పెక్టర్ మధుబాబు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సహజీవనం చేస్తున్న మహిళను హత్య చేసిన కేసులో ఆరేళ్లుగా పరారీలో ఉన్న రాజమహేంద్రవరం సుబ్బారావునగర్‌కు చెందిన తొండపు నాగప్రసాద్(ప్రసాద్)ను శుక్రవారం రాత్రి అరెస్టు చేసినట్లు త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ జి.మధుబాబు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలం రామన్నపాలేనికి చెందిన పేరుబోయిన శివభవాని (మృతురాలు) 2008లో మొదటిభర్త చనిపోవడంతో కుమార్తెను తీసుకుని బతుకుతెరువు నిమిత్తం రాజమహేంద్రవరం వచ్చింది. ప్రభుత్వాసుపత్రిలో గర్భిణులు, రోగులకు సేవలందిస్తూ వారిచ్చే డబ్బులతో తన కుమార్తెతో కలసి జీవిస్తుండేది. శివభవానికి కార్ డ్రైవర్ తొండపు నాగప్రసాద్‌తో పరిచయం ఏర్పడింది. నాగప్రసాద్ భార్యకు ఓ ప్రమాదంలో మతిస్థిమితం పోయింది. దీంతో 2014 నుంచి శివభవాని, తన కుమార్తెతో కలసి నాగప్రసాద్ ఇంట్లోనే కాపురం ఉన్నారు. అనంతరం ఆ ఇల్లు అమ్మేయడంతో పక్కనే ఉన్న సంజీవయ్య నగర్‌లో అద్దెకు వెళ్లారు. 2017 మార్చి 2న శివభవాని ఇంట్లో మృతిచెంది ఉంది. మృతురాలి తల్లి పేరుబోయిన కొవ్వాడమ్మ, బంధువులు వచ్చి చూడగా శివభవాని పీకకోసి ఉంది. ముందురోజు తమకు గొడవ జరగడంతో ఆమె పీక కోసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని నాగప్రసాద్ అందరినీ నమ్మించాడు. దీంతో బంధువులు శివభవాని మృతదేహాన్ని స్వగ్రామం తీసుకువెళ్లి దహన సంస్కారాలు జరిపించారు. అంత్యక్రియలు పూర్తయిన రెండు వారాల తరువాత మృతురాలి సోదరుడు వెంకటేష్‌కు నాగప్రసాద్ ఫోన్ చేసి మీచెల్లి తనకు తానుగా పీక కోసుకుని ఆత్మహత్య చేసుకోలేదని, తరచూ డబ్బులు కోసం వేధిస్తుందని అందుకే తానే చంపేశానని తెలిపాడు. దీంతో ఈ విషయమై 21 రోజుల అనంతరం మృతురాలి తల్లి కొవ్వాడమ్మ త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పటి ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రామకోటేశ్వరరావు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి నాగప్రసాద్ పరారీలో ఉండగా, ప్రస్తుత త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ జి.మధుబాబు, సెంట్రల్ జోన్ డీఎస్పీ జేవీ సంతోష్ పర్యవేక్షణలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితుడిని అరెస్టు చేశారు. రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు. నిందితుడిని అరెస్ట్ చేయడంలో ప్రతిభ చూపిన త్రీటౌన్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్స్ బీఎంవీవీ భానుమూర్తి, జె.సుబ్బారావు, క్రైమ్ కానిస్టేబుళ్లు కె.వెంకటేశ్వరరావు, బి.విజయ కుమార్‌లను సెంట్రల్ జోన్ డీఎస్పీ జేవీ సంతోష్ అభినందించారు.

పొట్టకూటికి వచ్చి పరలోకాలకు..

ఇద్దరు మత్స్యకారుల మృతి



ఘటనా స్థలంలో మృతదేహాలు

కిర్లంపూడి: కాయకష్టం చేసుకుని జీవించే కుటుంబాలు వారికి.. పొట్టకూటి కోసం ఊరుకాని ఊరు వచ్చారు. చెరువు ఊబిలో చిక్కి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు.. ఈ ఘటనతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది. కిర్లంపూడి మండలం బూరుగుపూడిలో ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. బూరుగుపూడి గ్రామంలోని దుశ్లామ్ చెరువులో చేపలు పట్టేందుకు కృష్ణా జిల్లా నుంచి 70 మంది శనివారం వచ్చారు. వీరు చేపలు పట్టేందుకు వలతో సిద్ధమై చెరువులోకి దిగారు. ఇందులో తిప్పగ్రామం (ఉర్లగొంది)కి చెందిన తిరుమారి సత్యనారాయణ (41), బస్వాని సత్యనారాయణ (55) బురదలో కూరుకుపోయారు. వెంటనే సహచరులు గురించి కేకలు వేశారు. అప్పటికే వారు గల్లంతయ్యారు. ఈ విషయమై కిర్లంపూడి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై బి.తిరుపతిరావు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికులతో చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. చెరువు అడుగు భాగాన బురదలో కూరుకుపోయిన తిరుమారి సత్యనారాయణ, బి.సత్యనారాయణ మృతదేహాలను వెలికితీశారు. ఇదిలా ఉంటే బస్వాని సత్యనారాయణకు భార్యతో పాటు అమ్మాయి, అబ్బాయి ఉన్నాయి. తిరుమారి సత్యనారాయణకు భార్య, పాప ఉన్నారు. ఈ కుటుంబాలకు వీరే పెద్ద దిక్కు. సంఘటనా స్థలాన్ని సీఐ సూర్యఅప్పారావు పరిశీలించారు.